మా నినాదం సబ్‌కా సాత్.. సబ్‌కా వికాస్

● ఓబీసీ సదస్సులో మల్కాజ్‌గిరి లోక్‌సభ అభ్యర్థి ఈటల రాజేందర్ ● 27 ఓబీసీ మంత్రులు, 25 దళిత, గిరిజన, మైనార్టీ మంత్రులున్న ఏకైక ప్రభుత్వం మాదే..

కుత్బుల్లాపూర్: సబ్‌కా సాత్ సబ్‌కా వికాస్ బీజేపీ నినాదమని, సీఎం రేవంత్‌రెడ్డి అహంకారపూరితంగా ప్రధాని నరేంద్రమోదీపై విద్వేషం వెదజల్లుతున్నారని మల్కాజ్‌గిరి లోక్‌సభ పార్టీ అభ్యర్థి ఈటల రాజేందర్ అన్నారు. ఆదివారం కొంపల్లిలో జరిగిన కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఓబీసీ సదస్సుకు ఈటల ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ... రేవంత్‌రెడ్డి బీజేపీ ప్రభుత్వం రిజర్వేషన్లు రద్దు చేస్తుందని అబద్ధాలు చెబుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్సీ రిజర్వేషన్లు అమలు చేస్తామని మోదీ చెబుతుంటే రాజకీయ లబ్ధి పొందేలా రిజర్వేషన్లపై ఇష్టం వచ్చినట్లు కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. నోటికొచ్చినట్లు మాట్లాడితే ప్రజలు చూస్తూ ఊరుకోరని కర్రు కాల్చి వాత పెట్టే రోజులు దగ్గర్లోనే ఉన్నాయన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మల్కాజ్‌గిరి లోక్‌సభ అభ్యర్థి ఈటల రాజేందర్

నాలుకకు నరం లేనట్టు మాట్లాడితే శాస్తి తప్పదు...

◆ 27 మంది ఓబీసీ మంత్రులు, 12 మంది దళిత, 8 మంది గిరిజన, 5 మంది మైనార్టీ మంత్రులున్న ఏకైక ప్రభుత్వ బీజేపీది అని తెలిపారు. 75 సంవత్సరాల పాటు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ఏనాడైనా అన్ని వర్గాలకు మంత్రి వర్గంలో స్థానం కల్పించిందా అని ప్రశ్నించారు. మైనారిటీ బిడ్డ అబ్దుల్ కలాం, దళితబిడ్డ రామనాథ్ కోవింద్, ఆదివాసీ బిడ్డ ముర్ములను రాష్ట్రపతిని చేసిన బీజేపీ గురించా రేవంత్‌రెడ్డి మాట్లాడేదని అన్నారు. ఓబీసీని ప్రధాని చేసిన పార్టీ బీజేపీ అని కొనియాడారు. నాలుకకు నరం లేనట్టు మాట్లాడితే తగిన శాస్తి తప్పదన్నారు.

హిందూ గాళ్లు.. బొందు గాళ్లు' అని మాట్లాడిన కేసీఆర్‌కు వాతపెట్టారు

◆ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ 'అక్షింతలు పంచితే... జైశ్రీరామ్'అని మాట్లాడితే కడుపునిండుతుందా అని ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో 'హిందూ గాళ్లు.. బొందు గాళ్లు'అని మాట్లాడితే రాష్ట్ర ప్రజలు కర్రు కాల్చి వాతపెట్టారని గుర్తు చేశారు. ముఖాలు చూసి పదవులు, హామీలు ఇచ్చేది మీ పార్టీల విధానమని విమర్శించారు. సబ్ కా సాత్ సబ్ కా వికాస్ తమ నినాదమని అన్నారు.

గిరిజనుడిని, ఓబీసీని సీఎం చేసిన ఘనత బీజేపీదే..

◆ ఛత్తీస్‌ఘడ్‌లో గిరిజనుడిని, మధ్యప్రదేశ్‌లో ఓబీసీని సీఎం చేసిన పార్టీ తమదని తెలిపారు.



తెలంగాణలో అధికారంలోకి వస్తే ఓబీసీని సీఎం చేస్తానని ప్రధాని చెప్పిన విషయాన్ని ఈటల ఈ సందర్భంగా గుర్తు చేశారు. తెలంగాణాలో రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలు నమ్మి ప్రజలు కాంగ్రెస్‌కు ఓటు వేయలేదన్నారు. కేసీఆర్ మళ్లీ వస్తే ప్రజాస్వామ్యం ఉండదేమో అనే భయంతో వేశారని పేర్కొన్నారు.

హామీలను నెరవేర్చని సీఎం రేవంత్‌రెడ్డిని ప్రశ్నించండి..

◆ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఇచ్చిన హామీలు అమలు చేయని సీఎంను ప్రజలు గట్టిగా ప్రశ్నించాలన్నారు. మహిళకు 2500 రూపాయలు వస్తున్నాయా? 4వేల రూపాయల పెన్షన్ వస్తుందా ? వికలాంగులకు 6 వేల పెన్షన్ వస్తుందా? ఆడపిల్లలకు స్కూటీ వచ్చిందా? కల్యాణలక్ష్మితో పాటు తులం బంగారం వస్తుందా? ఆటోడ్రైవర్లకు 12 వేలు ఇస్తా అన్నారు ఇచ్చారా? మహిళా సంఘాలకు 10 లక్షల రుణం ఇచ్చారా? డబ్బుల ఖర్చులేని రేషన్‌కార్డు కూడా ఇచ్చే దమ్ములేని సీఎం అని రేవంత్‌రెడ్డిపై విరుచుకు పడ్డారు. ఒక్క ఆర్టీసీ బస్సు సదుపాయం తప్ప ఏదీ ఇవ్వడం లేదన్నారు.

కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు గుణపాఠం చెప్పడం ఖాయం..

వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు రాష్ట్ర ప్రజలు గుణపాఠం చెప్పడం ఖాయమన్నారు. ఈ సమావేశంలో మంగేష్ కుమార్, నందనం దివాకర్, వెంకటేష్, ఆంజనేయులు, రామోజీ, శేఖర్ యాదవ్, విజయ్ కుమార్, సుజాత, నర్మద, మల్లిఖార్జున్ తదితరులు హాజరయ్యారు.

అ'పూర్వ' సమ్మేళనం


ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న 2003-04 బ్యాచ్ దూలపల్లి జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు

సుభాష్‌నగర్: కొంపల్లి మున్సిపల్ దూలపల్లికి చెందిన జిల్లా పరిషత్ హైస్కూల్ 2003–04 బ్యాచ్ పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో తమకు విద్యాబోధన చేసిన ఉపాధ్యాయులను సన్మానించి గత స్మృతులను నెమరు వేసుకున్నారు. విశేషమేమిటంటే 20 సంవత్సరాల క్రితం ఏ తరగతి రూమ్‌లో కూర్చున్నారో.. అదే గదిలో బెంచ్‌లో కూర్చుని తమ తీపి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఇలా ప్రతి ఏటా ఒకసారి కలుసుకోవాలని నిశ్చయించుకున్నారు.

'శిఖం భూమిని మట్టితో చదును చేసేస్తున్నారు'


తుమార్ చెరువు శిఖం భూమిలో మట్టితో చదును చేస్తున్న దృశ్యం

సుభాష్‌నగర్: కొంపల్లి మున్సిపల్ దూలపల్లి లోని తుమార్ చెరువు బఫర్ జోన్‌లో మట్టితో పూడుస్తున్నా సంబంధిత అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని స్థానిక కౌన్సిలర్ రవీందర్‌యాదవ్ ఆరోపించారు. దూలపల్లి గ్రామం నుంచి చర్మాస్ వెళ్లే ప్రధాన దారిని ఆనుకొని ఉన్న ఆనుకొని ఉన్న తుమారు చెరువును కొంతకాలంగా కొంతమంది పూడ్చి వేస్తున్నారని తెలిపారు. ఈ విషయంపై గతంలో అధికారులకు ఫిర్యాదు చేయగా కుత్బుల్లాపూర్, మేడ్చల్ తహసీల్దార్లు సందర్శించి పోసిన మట్టిని తరలించాలని ఆదేశించారన్నారు. మట్టిని తరలించడం ఏమిటో గాని గత కొంతకాలంగా గుట్టుచప్పుడు కాకుండా చెరువు శిఖం స్థలాన్ని మట్టితో పూడుస్తున్నారని తెలిపారు. ఈ విషయమై ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదుగా ఆదివారం సదరు స్థలాన్ని పరిశీలించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మట్టి పోస్తున్న వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని కౌన్సిలర్ రవీందర్ యాదవ్ డిమాండ్ చేశారు.

కాంగ్రెస్ ప్రభుత్వ పథకాలే సునీతను గెలిపిస్తాయి

కుత్బుల్లాపూర్ ఇన్‌చార్జి కొలన్ హన్మంతరెడ్డి


వాసవీ కాలనీలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న హన్మంతరెడ్డి

నిజాంపేట్: లోక్‌సభ ఎన్నికల్లో మల్కాజ్‌గిరి కాంగ్రెస్ అభ్యర్థి సునీతామహేందర్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. ఆదివారం నిజాంపేట్ కార్పొరేషన్ 22వ డివిజన్‌లోని వాసవీ కాలనీలో జరిగిన సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. మే 13న జరిగే లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు ఏకపక్షంగా కాంగ్రెస్ పార్టీకి ఓటేయ్యనున్నారని తెలిపారు. ప్రభుత్వ పథకాలే అభ్యర్థి సునీతామహేందర్‌ను గెలిపిస్తాయన్నారు. ఈ సమావేశంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి భూపతిరెడ్డి, మేయర్ కొలన్ నీలారెడ్డి, నాయకులు కొలన్ శ్రీనివాస్‌రెడ్డి, కార్పొరేషన్ అధ్యక్షుడు కొలన్ రాజశేఖర్‌రెడ్డి, కారుమంచి ప్రసన్నకుమార్, మేడా శ్రీనివాస్‌రావు, కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

ముఖ్య నేతల సమావేశానికి మధుయాష్కిగౌడ్

కుత్బుల్లాపూర్: మల్కాజ్‌గిరి లోక్‌సభ నియోజకవర్గ కాంగ్రెస్ ఎన్నికల ఇన్‌చార్జి మైనంపల్లి హన్మంత్‌రావు నివాసంలో ఆదివారం ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి తెలంగాణ కాంగ్రెస్ కాంపెయిన్ కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ , ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, కుత్బుల్లాపూర్ పార్లమెంట్ ఎన్నికల అబ్జర్వర్ శోభారాణి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి భూపతిరెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జిలు వజ్రేష్ యాదవ్, బండి రమేష్, పరమేశ్వర్‌రెడ్డి, సత్యం శ్రీరంగం తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ అభ్యర్థి సునీతామహేందర్‌రెడ్డి విజయానికి అనుసరించాల్సిన వ్యూహాలు, కార్యాచరణపై నాయకులు చర్చించారు.


మైనంపల్లి హన్మంతరావు నివాసంలో జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో నాయకులు

'ముదిరాజ్‌లను బీసీ-ఏలో కలుపుతామనడం సరికాదు'

పంజగుట్ట: ముదిరాజ్‌లను బీసీ ఏలో కలుపుతామ ని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించడం సబబు కాదని తెలంగాణ ప్రదేశ్ గంగపుత్ర సంఘం, బీసీ ఏ గ్రూపు లోని 57 కులాల ప్రతినిధులు అన్నారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో గంగపుత్ర సంఘం అధ్యక్షుడు గడప శ్రీహరి, నగర అధ్యక్షుడు చాట్ల సదానంద్, నాయీబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు ప్రొఫెసర్ బాగయ్య, బీసీ ఏ కులాల ఐక్యవేదిక అధ్యక్షుడు ఎం.ఎస్.నరహరి, కార్యదర్శి ముత్యాల నర్సింహులు మాట్లాడారు. నాగర్ కర్నూల్ జిల్లా నారాయణపేట ఎన్నికల ప్రచారంలో సీఎం రేవంత్ రెడ్డి బీసీ డీ లో ఉన్న ముదిరాజ్‌లను బీసీ ఏ లో కలుపుతానని ప్రకటించడం బాధాకరమన్నారు. బీసీ ఏ లో అన్ని అణగారిన కులాలు ఉన్నాయని అందులో ముదిరాజ్‌లను ఎలా కలుపుతారని ప్రశ్నించారు. సుప్రీంకోర్టులో ఉన్న ఈ అంశాన్ని ఎలా మాట్లాడతారని, అది ఎన్నికల కోడ్ ఉన్న సమయంలో కోర్టు ధిక్కరణకు పాల్పడడం సరికాదన్నారు. సీఎం తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని లేకుంటే బీసీఏ లోని 57 కులాలు, రాష్ట్రంలో 18 శాతం జనాభా ఉన్నామని అందరం కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ఓటు వేస్తామని హెచ్చరించారు. ముదిరాజ్‌ల కన్నా తాము ఎక్కువగా ఉన్నామని త్వరలోనే ఒక భారీ కార్యక్రమం నిర్వహించి చూపిస్తామని పేర్కొన్నారు.



తెలంగాణ ఇప్పుడిప్పుడే కోలుకుంటోంది


కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్

కుత్బుల్లాపూర్: పదేళ్ల పాటు బీఆర్ఎస్ సృష్టించిన విధ్వంసం నుంచి తెలంగాణ ఇప్పుడిప్పుడే కోలుకుంటోందని... సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో రాష్ట్రం వేగంగా అభివృద్ధి సాధిస్తుందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. నిజాంపేట్‌కు చెందిన బీజేపీ నేత విజయ్‌కుమార్‌తో పాటు పలువురు నాయకులు, బీజేపీ కార్యకర్తలు శ్రీశైలం గౌడ్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.

◆ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నియోజకవర్గ అభివృద్ధిలో భాగస్వామ్యం అయ్యేందుకే బీజేపీ, బీఆర్ఎస్‌ల నుంచి కాంగ్రెస్ పార్టీలోకి వస్తున్నారని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డికి కొడంగల్ రాజకీయంగా జన్మనిస్తే మల్కాజిగిరి పునర్జన్మనిచ్చిందని అన్నారు. మల్కాజిగిరి ప్రాంతమంటే రేవంత్‌రెడ్డికి మక్కువ ఎక్కువని పేర్కొన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థి పట్నం సునీతామహేందర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సన్నే విజయ్‌కుమార్, విష్ణు, ఆది నారాయణ, మినాష్, సాయికిరణ్, శంకర్, లింగం, హరీష్, దయా, నగేష్, మణికంఠ తదితరులు కాంగ్రెస్ పార్టీలో చేరగా నేతలు బొబ్బ రంగారావు, రహ్మతుల్లా, వేణుగోపాల్ రాజు ఉన్నారు.


అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కూన శ్రీశైలంగౌడ్

◆ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి ఉత్సవాల సందర్భంగా నెహ్రూనగర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కూన శ్రీశైలంగౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బహుజన సంఘాల నేతలు బస్వరాజు, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

కుటుంబకలహాలతో పురుగుల మందు తాగిన వ్యక్తి

చికిత్స పొందుతూ మృతి

కుత్బుల్లాపూర్: కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడి ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దూలపల్లికి చెందిన కుమ్మరి రాములు (46) అతని భార్యకు మధ్య గొడవ జరగడంతో వారం రోజుల క్రితం తాండూర్‌లోని పుట్టింటికి వెళ్లింది. ఇంటికి తిరిగి రమ్మని చెప్పినా వినకపోవడంతో మనస్తాపానికి గురైన రాములు ఈ నెల 26న రాత్రి 11 గంటలకు ఇంట్లో ఉన్న పురుగుల మందు సేవించాడు. సదరు డబ్బాను ఫొటో తీసి భార్యకు వాట్సప్ చేశాడు. దీంతో కంగారు పడిన ఆమె చుట్టుపక్కల వారికి ఫోన్‌లు చేసి ఆస్పత్రికి తీసుకువెళ్లమని కోరగా అతను నిరాకరించాడు. 27వ తేదీన ఇంటికి వచ్చిన భార్య రాములును గాంధీ ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా కామాక్షి బ్రాహ్మణ సంఘం విజయోత్సవ సభ

నిజాంపేట్: నిజాంపేట్‌లోని రేణుకా ఎల్లమ్మ ఆలయ ప్రాంగణంలోని కమిటీహాలులో ఆదివారం శ్రీకామాక్షి బ్రాహ్మణ సంఘం విజయోత్సవ సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ప్రముఖ సినీ నటుడు సుబ్బరాయనశర్మ మాట్లాడుతూ.. మూడు సంవత్సరాలుగా ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతూ కామాక్షి బ్రాహ్మణ సంఘం ప్రజల ఆదరాభిమానాలు చూరగొంటోందని అభినందించారు. ఈ సందర్భంగా హైకోర్టు న్యాయవాది పీవీ. ఎస్‌కే. చక్రవర్తి, డెవలపర్ వంశీకృష్ణ, సినీ నటుడు సుబ్రహ్మణ్యకుమార్, రియల్ ఎస్టేట్ అధినేత అరవింద్, పారిశ్రామికవేత్త జీఆర్‌కే మూర్తి, ఆధ్యాత్మికవేత్త నరసింహారావులను శాలువలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సభ్యులు సుధాకర్, శంకర్, నరసింహారావు, రామారావు, మహిళా విభాగం నుంచి భువనేశ్వరి, కల్యాణి, రమణి, జయశ్రీ, అనిత, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.


విజయోత్సవ సభలో సభ్యులు, ప్రముఖులు

భర్త దూరం కావడంతో ఉరేసుకుని మహిళ ఆత్మహత్య

కుత్బుల్లాపూర్: భర్త దూరం కావడంతో మనస్తాపానికి గురైన ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కుత్బుల్లాపూర్ ఎం.ఎస్.రెడ్డినగర్‌కు చెందిన రేణుక(24) భర్త గత కొంత కాలంగా ఇంటికి రాకుండా దూరంగా ఉంటూ వస్తున్నాడు. దీంతో తీవ్ర మనస్తాపం చెందిన రేణుక ఈనెల 25న ఇంట్లో ఎవరూ లేని సమయంలో సీలింగ్ ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుంది. ఈ విషయాన్ని గమనించిన చుట్టు పక్కల వారు తలుపులు బద్దలకొట్టి ఆమెకు కిందకు దించారు. స్థానికంగా ఉన్న సృజన ఆస్పత్రిలో చేర్పించగా ఆదివారం చికిత్స పొందుతూ రేణుక మృతి చెందింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్థిక ఇబ్బందులతో ట్రాలీ డ్రైవర్ ఆత్మహత్య

కుత్బుల్లాపూర్: ఆర్థిక ఇబ్బందులతో ఓ ట్రాలీ డ్రైవర్ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్‌జిల్లా శంకరంపేట్ గ్రామానికి చెందిన అరికెల మహేష్(28) ఎన్‌సీఎల్ నార్త్‌లో నివాసముంటున్నాడు. గతంలో క్యాబ్ డ్రైవర్‌గా పని చేసిన అతను ట్రాలీ ఆటోను కొనుగోలు చేసి నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల ఆర్థిక ఇబ్బందులు పెరగడంతో తీవ్ర మనస్తాపానికి గురైన మహేష్ ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కారు డ్రైవర్‌పై కేసు

బంజారాహిల్స్: సైలెన్సర్ మార్చి పెద్ద శబ్దాలతో ప్రమాదకరంగా వాహనం నడుపుతున్న డ్రైవర్‌పై జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. శనివారం అర్ధరాత్రి 1.40 గంటల ప్రాంతంలో పెద్ద శబ్దాలు చేసుకుంటూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేసేలా అతి వేగంగా వెళ్తున్న హోండా సివిక్ కారును పోలీసులు అడ్డుకున్నారు. టోలిచౌకికి చెందిన డ్రైవర్ ఎండీ అనస్ ఆదిల్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి కారును సీజ్ చేశారు. ఎవరైనా తమ వాహనాలకు సైలెన్సర్ మార్చి పెద్ద పెద్ద శబ్దాలు చేస్తూ ప్రజలకు అసౌకర్యం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జూబ్లీహిల్స్ ఇన్‌స్పెక్టర్ హెచ్చరించారు.

నాసిరకం.. జాప్యం.. నిర్లక్ష్యం

ముందుకు సాగని వైకుంఠథామాల అభివృద్ధి పనులు

చింతల్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న వైకుంఠథామాల పనులు ఏళ్లు గడుస్తున్నా ముందుకు సాగడం లేదు. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ నాసిరకంగా నిర్మిస్తుండడంతో పాటు నత్తనడకన పనులు చేపడుతుడటంతో ఎప్పుడు పూర్తి చేస్తారా అని స్థానిక ప్రజలు ఎదురుచూస్తున్నారు. చింతల్ డివిజన్‌లోని చింతల్ సబ్‌స్టేషన్ పక్కన ఉన్న శ్మశానవాటికలో వైకుంఠ ధామం ఏర్పాటుకు గత ఏడాది రూపాయలు కోటి ఆరు లక్షల రూపాయల నిధులు కేటాయించిన అధికారులు ప్రణాళికలు సిద్ధం చేసి శంకుస్థాపన చేశారు. అధికారులు నిధులు విడుదల చేయడంలో జాప్యం చేస్తున్నాడంతో శ్మశానవాటికలు అభివృద్ధి పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. దీనికి తోడుగా పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ సైతం నిర్లక్ష్యంగా పనులు కొనసాగిస్తుండడంతో శ్మశానవాటిక అభివృద్ధి పనులు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా మారింది.

◆ అంతేకాకుండా శ్మశానవాటిక నిర్మాణంలో నాణ్యత లోపంతో నిర్మిస్తున్నారని స్థానిక చింతల్ వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు పర్యవేక్షణ కరువై కాంట్రాక్టర్ ఇష్టానుసారంగా నాసిరకంగా పనులు చేస్తున్నారని నాసిరకమైన ఇసుక, మెటీరియల్ ఉపయోగిస్తుండడంతో పదికాలాలపాటు ఉండాల్సిన వైకుంఠథామం నాణ్యతపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

నిలిచిపోయిన వైకుంఠథామం పనులు...

◆ శ్మశానవాటిక నిర్మాణానికి అధికారులు కొద్ది మేర నిధులు మాత్రమే విడుదల చేయడంతో కాంట్రాక్టర్ అక్కడ వరకే పనులు పూర్తి చేసి చేతులెత్తేశాడు. నిధులు విడుదల చేయాలంటూ స్థానికులు పలుమార్లు అధికారులకు ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకునే వారు కరువయ్యారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం


చింతల్ శ్మశానవాటికలో మధ్యలో నిలిచిపోయిన వైకుంఠథామం నిర్మాణం

వైకుంఠథామం పనులు సగభాగం వరకే పూర్తి కావడంతో దహన సంస్కారాలకు వచ్చేవారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. స్నానాల గదులు లేకపోవడంతో ఆరుబయటే స్నానాలు చేస్తున్నడంతో వృద్ధులు, మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దహన సంస్కారాలకు వచ్చే వారు బయట నుంచి ట్యాంకర్లను తీసుకురావాల్సిన దుస్థితి నెలకొంది.

పట్టించుకోని ప్రజాప్రతినిధులు అధికారులు

◆ 2022 ఆగస్టులో శంకుస్థాపన చేసిన వైకుంఠ ధామం పనులకు ఇప్పటివరకు సుమారు రూ.45లక్షల వరకు నిధులు విడుదలైనట్లు స్థానికులు పేర్కొంటున్నారు. మరి మిగిలిన నిధులు విడుదల కాకపోవడంతో వైకుంఠథామం అభివృద్ధి పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. మిగతా నిధులు విడుదల చేయాలని పలుమార్లు అధికారానికి పలుమార్లు అధికారులకు విన్నపాలు చేసినా ఫలితం లేకపోయింది. దీంతో రెండేళ్లుగా వైకుంఠథామం పనులు ముందుకు సాగడం లేదు. దహన సంస్కార భవనానికి శ్లాబ్ వేసి వదిలేయడంతో దాని నాణ్యత దెబ్బతినే ప్రమాద ఉందని.. స్నానపు గదులకు సైతం ప్లాస్టరింగ్ చేయలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి శ్మశానవాటిక పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


నత్తనడకన సాగుతున్న స్నానాలు గదుల నిర్మాణం


దహన సంస్కారాల అనంతరం స్నానాలు చేసేందుకు ఏర్పాటుచేసిన నీటి కుళాయిల గదుల దృశ్యం

ఐలా స్థలం.. విక్రయించేందుకు యత్నం


ప్లాట్ నం.139లో గతంలో ఉన్న ఓవర్ హెడ్ ట్యాంక్


ఓవర్ హెడ్ కూల్చివేసిన ప్లాంట్ నం.139లోని ఐలా స్థలం

రంగారెడ్డినగర్: ఐలాకు సంబంధించిన స్థలాన్ని సొసైటీ సభ్యులు విక్రయించేందుకు యత్నిస్తుండటం వివాదాస్పదంగా మారింది. గాంధీనగర్‌లోని ఐలా కార్యాలయ భవన పక్కనే ఉన్న ప్లాట్ నం.139లో గతంలో స్థానికంగా నీటి అవసరాలను తీర్చేందుకు వంద గజల స్థలంలో ఓవర్ హెడ్ ట్యాంక్‌ను ఏర్పాటు చేసి కొంత కాలంగా నీటి సరఫరా చేశారు. అయితే సదరు ట్యాంక్ శిథిలావస్థకు చేరి ప్రమాకరంగా మారడంతో ఈ విషయమై 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది.

◆ ఈ నేపథ్యంలో చుట్టు పక్కల ఉన్న పరిశ్రమ యాజమాన్యాలు అడ్డు తగిలినా ఐలా అధికారులు ఓవర్ హెడ్ ట్యాంక్‌ను నేలమట్టం చేశారు. ఇంత వరకు బాగానే ఉంది. ప్రస్తుతం ఖాళీగా ఉన్న జాగాపై బాలానగర్ సొసైటీ సభ్యుల కన్ను పడింది.

◆ 1974లో ఏర్పడి బాలానగర్ సొసైటీ ఆధ్వర్యంలో గతంలో ఐడీఏ స్థలాలు ఉండేవి. 2006లో గాంధీనగర్ ఐలా ఏర్పడటంతో సదరు స్థలాలు ఐలాకు బదిలీ అయ్యాయి. అయితే ఓవర్ హెడ్ ట్యాంక్ స్థలం తమ సొసైటీకి చెందిందని బాలానగర్ సొసైటీ సభ్యులు, కాదు ప్రభుత్వానికి చెందినదిగా ఐలా అధికారుల నడుమ గత కొంత కాలంగా వివాదం నడుస్తోంది.

◆ ఈ ప్రాంతంలో గజం స్థలం రూ. లక్షకు పైగానే ధర పలుకుతుండటంతో ఎలాగైనా సదరు స్థలాన్ని విక్రయించి సొమ్ము చేసుకోవాలని సొసైటీ సభ్యులు యత్నిస్తున్నట్లు సమాచారం. ఈ విషయంలో ఐలా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించి ప్రభుత్వ స్థలాన్ని పరిరక్షించడంతో పాటు సదరు స్థలాన్ని వేలంపాట వేస్తే ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతుందని పలువురు అభిప్రాయ పడుతున్నారు.